
సాక్షి కుమురం భీం

శుక్రవారం, 3, జనవరి, 2025



మెడికోలకు 'వసతి' కష్టాలు

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ వైద్యకళాశాల విద్యార్థులు సరైన వసతులు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గురువారం తరగతులు బహిష్కరించి ఆందోళన తెలిపారు. 8లో▸



నిర్మల్ పిలుస్తోంది...

నిర్మల్ జిల్లాలో సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 'నిర్మల్ ఉత్సవాలు' పేరిట ఏటా కార్యక్రమాలు నిర్వహించేలా కొత్తట్రెండ్ ప్రారంభిస్తున్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
28.3 /12.3

వాతావరణం

ఆకాశం కొంతమేర మేఘావృతమై ఉంటుంది. రాత్రి ఉష్ణోగ్రతలు బాగా తగ్గుతాయి. మధ్యాహ్నం చల్లగాలి వీస్తుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌గా డేవిడ్



డీసీకి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఉద్యోగులు

కైలాస్‌నగర్: ఎక్సైజ్ శాఖ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా డిప్యూటీ కమిషనర్‌గా డేవిడ్ రవికాంత్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు డీసీగా పనిచేసిన నరసింహారెడ్డి డిసెంబర్ 31న రిటైర్డ్ అయ్యారు. దీంతో కరీంనగర్ జిల్లా డిప్యూటీ కమిషనర్‌గా పనిచేస్తున్న రవికాంత్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయన జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మళ్లీ పెరిగిన చలి

తిర్యాణి(ఆసిఫాబాద్): జిల్లాలో మళ్లీ చలి తీవ్రత పెరిగింది. అల్పపీడన ప్రభావంతో గడిచిన పది రోజులుగా సాధారణ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గురువారం కనిష్ట ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోవడంతో చలి పెరిగింది. రాష్ట్రంలోనే అత్యల్పంగా సిర్పూర్(యూ)లో 7.3 డిగ్రీల సెల్సియస్ కనిష్ట ఉష్ణోగ్రత నమోదు కాగా, తిర్యాణి మండలం గిన్నెధరిలో 8.0 డిగ్రీలుగా రికార్డు అయ్యింది. అలాగే తిర్యాణి మండల కేంద్రంలో 9.1, కెరమెరిలో 10.1, ధనోరాలో 10.8, కాగజ్‌నగర్ మండలం జంబుగాలో 11.0, జైనూర్‌లో 11.3, రెబ్బెన మండలం వంకులంలో 11.9 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న మూడు రోజుల్లో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

భీం పోరాటం అందరికీ ఆదర్శం



కుమురం భీం విగ్రహానికి పూలమాల వేస్తున్న ఏఎస్పీ చిత్తరంజన్

కెరమెరి(ఆసిఫాబాద్): హక్కుల కోసం కుమురంభీం సాగించిన పోరాటం అందరికీ ఆదర్శమని ఏఎస్పీ చిత్తరంజన్ అన్నారు. ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన గురువారం మండలంలోని జోడేఘాట్‌ను సందర్శించారు. కుమురంభీం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమాధి వద్ద పూజలు చేశారు. భీం మనుమడు సోనేరావు, ఆదివాసీ నాయకులను కలిసి మాట్లాడారు. అనంతరం కెరమెరిలోని పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. పోలీసులు ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ఆయన వెంట సీఐ సత్యనారాయణ, ఎస్సై గుంపుల విజయ్ తదితరులు ఉన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తులు

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే పోటీ పరీక్షలకు బేసిక్ ఫౌండేషన్ శిక్షణ అందించేందుకు జిల్లాలోని అర్హత గల మైనార్టీ వర్గాలకు చెందిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన మైనార్టీ వర్గాల అభ్యర్థులు ఈ నెల 10లోగా జిల్లా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎంపికైన వారికి నాలుగు నెలలపాటు ఉచిత శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు.

శివమల్లన్న ఆలయానికి రూ.3.2లక్షల ఆదాయం



నగదు లెక్కిస్తున్న సభ్యులు

కాగజ్‌నగర్‌రూరల్: షష్టి బోనాల నేపథ్యంలో మండలంలోని ఈజ్‌గాం శివమల్లన్న ఆలయానికి భారీగా ఆదాయం సమకూరింది. ఆదిలాబాద్ డివిజన్ దేవాదాయశాఖ పరిశీలకుడు రవికిరణ్ పర్యవేక్షణలో ఆలయ ఆవరణలో గురువారం హుండీ ఆదాయం లెక్కించారు. హుండీ ద్వారా రూ.3,22,594 నగదు రాగా, 220 గ్రాముల వెండి వచ్చింది. ఆలయ ఈవో వేణుగోపాల్ గుప్తా, ఉత్సవ కమిటీ చైర్మన్ మురళీధర్, సభ్యులు పాల్గొన్నారు.

రెవెన్యూ గ్రామానికో వీఎల్‌వో!

- నియామకానికి రాష్ట్ర సర్కారు కసరత్తు
- పూర్వపు వీఆర్వోలకు మళ్లీ రెవెన్యూ శాఖలోకి ఆహ్వానం
- ఇప్పటికే పలువురు దరఖాస్తు
- జిల్లాలో 434 రెవెన్యూ గ్రామాలు



రెబ్బెన మండలంలోని రెవెన్యూ గ్రామం ధర్మారం

సాక్షి ఆసిఫాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామస్థాయి నుంచి రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా రెవెన్యూ గ్రామానికి ఒక వీఎల్‌వో నియామకానికి కార్యాచరణ చేపట్టింది. గత ప్రభుత్వం వీఆర్వోలను ఇతర శాఖలోకి బదిలీ చేసిన సంగతి తెలిసిందే. అప్పట్లో బదిలీ అయిన ఉద్యోగులు మున్సిపాలిటీ, డీఆర్డీవో, ఎంపీడీవో, డీఈవో, వ్యవసాయశాఖలతో పాటు ఇతర శాఖల్లో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు. తాజాగా భూభారతి చట్టాన్ని పటిష్ఠం చేయడానికి ముమ్మరంగా యత్నిస్తున్న ప్రభుత్వం గ్రామస్థాయి అధికారులను(వీఎల్‌వో) నియమించాలని నిర్ణయించింది. గత ప్రభుత్వంలో వీఆర్వోలు, వీఆర్‌ఏలుగా పనిచేసిన వారందరినీ తిరిగి రెవెన్యూ వ్యవస్థలోకి తీసుకునేందుకు సిద్ధమైంది. తొలుత వీఆర్వోలను విధుల్లోకి తీసుకునేందుకు కార్యాచరణ రూపొందించింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేసింది. ఆసక్తి గల వీఆర్వోలు తిరిగి రెవెన్యూ వ్యవస్థలోకి వచ్చేందుకు దరఖాస్తు చేసుకోవాలి ఆదేశించింది.

జిల్లాలో ఇలా..

జిల్లాలోని 15 మండలాల పరిధిలో 434 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. గతంలో ఇక్కడ వీఆర్వోలు, వీఆర్‌ఏలు విధులు నిర్వర్తించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తాజా నిర్ణయంతో రెవెన్యూ వ్యవస్థ బలోపేతం చేసేందుకు గ్రామస్థాయి అధికారి(వీఎల్‌వో)ను నియామకం కానున్నారు. ఆసక్తి ఉన్న వీఆర్వోల నుంచి ఇప్పటికే దరఖాస్తులు స్వీకరించింది. జిల్లా వ్యాప్తంగా 74 మంది వీఆర్వోలు, 139 మంది వీఆర్‌ఏలు తిరిగి రెవెన్యూ వ్యవస్థలోకి వచ్చేందుకు సుముఖం వ్యక్తం చేస్తూ దరఖాస్తు చేసుకున్నారు.

డిగ్రీ అర్హతగా నిర్ణయం

కొత్తగా రెవెన్యూ వ్యవస్థలోకి రానున్న ఉద్యోగులకు డిగ్రీ అర్హతగా ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో ప్రస్తుతం దరఖాస్తు చేసుకున్న 74 మంది వీఆర్వోల్లో 33 మందికి డిగ్రీ, ఆపై అర్హత ఉంది. అలాగే వీఆర్‌ఏల్లో 40 మంది ఉద్యోగులకు డిగ్రీ, ఆపై అర్హత ఉంది. మిగిలిన వారు ఇంటర్ అంతకన్నా తక్కువ చదువుకున్న వారు ఉన్నారు. అయితే జిల్లాలో 434 రెవెన్యూ గ్రామాలు ఉండగా ప్రభుత్వం నిర్ణయించిన విద్యార్హత కలిగిన వారు కేవలం 73 మంది మాత్రమే ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు. మిగిలిన స్థానాలను ఏ విధంగా భర్తీ చేయనున్నారన్నది ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని తెలుస్తోంది.

'ఉపాధి' అండ!



ఎల్లారంలో పనులు ప్రారంభిస్తున్న అధికారులు(ఫైల్)

- వందశాతం రాయితీతో పశువుల పాకలు, నీటికుంటలు
- సద్వినియోగం చేసుకోవాలని అధికారుల సూచన

ఆసిఫాబాద్‌అర్బన్: వలసలు, కరువును అరికట్టేందుకు అమలు చేస్తున్న ఉపాధిహామీ పథకం రైతులు, పశువుల యజమానులకు సైతం అండగా నిలిస్తోంది. ఈ పథకం కింద పశువుల పాకలు, నీటికుంటలు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వందశాతం రాయితీ కల్పిస్తుండటంతో అన్నదాతలకు మేలు జరగనుంది. జిల్లాలోని 15 మండలాల్లో 335 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మండలానికి పది చొప్పున 150 పశువుల పాకలు, మండలానికి ఐదు చొప్పున 75 నీటి కుంటలు మంజూరయ్యాయి. పశువుల పాక నిర్మించే స్థలం విస్తీర్ణం, నిర్మాణం తీరును బట్టి నిధులు మంజూరు చేస్తారు. మార్చిలోగా లక్ష్యం చేరుకునేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

జిల్లాలో ఇలా..

జిల్లాలో వ్యవసాయం తర్వాత రైతులు ఎక్కువ మంది పశు సంపదపై ఆధారపడుతున్నారు. అటవీ విస్తీర్ణం ఎక్కువగా ఉండటంతో పశు సంపద ఏటా వృద్ధి చెందుతోంది. అయితే ఏజెన్సీ ప్రాంతాలు, మిగిలిన మండలాల్లో పాడి రైతులు తమ పశువులను ఆరుబయట, చేల వద్ద ఉంచుతున్నారు. ఈ తరుణంలో జిల్లాలో పెద్దపులులు, ఇతర వన్యప్రాణుల దాడిలో గాయపడుతున్నాయి. పశువుల పాకల నిర్మాణం పూర్తయితే రైతులకు మేలు జరగనుంది. పశు సంపదను మరింత పెంచుకునేందుకు అవకాశం ఉంటుంది. అర్హత కలిగిన వారు స్థానిక గ్రామ పంచాయతీ తీర్మానం ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఈజీఎస్ అధికారులు సూచిస్తున్నారు.

చిన్న, సన్నకారు రైతులకు నీటి కుంటలు

ఇక ఉపాధిహామీ నిధులతో పశువుల పాకలతోపాటు నీటి కుంటల నిర్మాణం కూడా చేపట్టనున్నారు. అయితే ఇవి మొదట చిన్న, సన్నకారు రైతులకే వర్తింపజేయనున్నారు. జిల్లాకు 75 యూనిట్లు మంజూరయ్యాయి. జిల్లావ్యాప్తంగా సాగునీటి వనరులు అంతంతే ఉన్నాయి. ప్రధాన ప్రాజెక్టుల కింద కూడా రెండు పంటలకు సాగునీరందని పరిస్థితి ఉంది. నీటి కుంటలు మారుమూల ప్రాంతాల్లోని రైతులకు ఉపయోగకరంగా మారనున్నాయి. పశువుల పాకలు, నీటి కుంటల నిర్మాణానికి అర్హులకు వందశాతం రాయితీ అందించనున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఉపాధిహామీ పథకం కింద పశువుల పాకలు, నీటి కుంటల నిర్మాణానికి ప్రభుత్వం అందిస్తున్న వందశాతం రాయితీని అర్హులు సద్వినియోగం చేసుకోవాలి. మార్చి 31లోగా లక్ష్యం మేరకు నిర్మాణాలు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– దత్తారావు, డీఆర్‌డీవో

మున్సిపాలిటీల్లో మురుగుశుద్ధి

- ఉమ్మడి జిల్లాలోని 11 బల్దియాల్లో సివేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ల నిర్మాణం
- రూ.123.98 కోట్లు మంజూరు
- ఉత్తర్వులు జారీ చేసిన సర్కారు

బల్దియాల వారీగా మంజూరైన నిధులు

మున్సిపాలిటీ	మంజూరైన నిధులు(రూ.లలో)
భైంసా	10,36,14,536
నిర్మల్	18,86,37,940
ఖానాపూర్	7,06,64,834
బెల్లంపల్లి	10,75,45,535
మందమర్రి	10,04,15,596
మంచిర్యాల	18,22,63,427
క్యాతన్‌పల్లి	8,52,28,553
లక్సెట్టిపేట	7,68,28,073
చెన్నూర్	9,25,38,602
నస్పూర్	12,67,86,900
కాగజ్‌నగర్	10,53,73,363

కైలాస్‌నగర్: మున్సిపాలిటీల్లో మురుగునీటి వ్యవస్థను మెరుగుపర్చాలని, డ్రైనేజీల్లో ప్రవహించే మురుగునీటితో కలిగే ఇబ్బందులకు చెక్‌పట్టాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించింది. స్వచ్ఛభారత్ మిషన్ 2.0 కింద అన్ని మున్సిపాలిటీల్లో అండర్ గ్రౌండ్ డ్రైనేజీలతో పాటు మురుగునీటిని శుద్ధి చేసేందుకు సివేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్(ఎస్టీపీ)ల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించింది. ఇందుకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 11 మున్సిపాలిటీలకు రూ.123కోట్ల 98లక్షల 97వేలు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. టెండర్ ప్రక్రియను రాష్ట్రస్థాయిలోనే ప్రజా రోగ్యశాఖ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో చేపట్టనున్నట్లు సమాచారం. రానున్న రెండు నెలల్లో టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి ఎస్టీపీల నిర్మాణ బాధ్యతలను సంబంధిత ఏజెన్సీలకు అప్పగించే కసరత్తు జరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

రూ.123.98 కోట్లు మంజూరు

మున్సిపాలిటీల్లో మురుగునీటి శుద్ధి వ్యవస్థ లేక డ్రైనేజీల నుంచి ప్రవహించే నీరంతా పంటచేలు, చెరువుల్లోకి చేరుతోంది. దీంతో అవి కలుషితమవుతున్నాయి. దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలుతున్నాయి. ఇలాంటి మురుగు సమస్యను పూర్తిగా దూరం చేయాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్వచ్ఛ భారత్ మిషన్ 2.0లో భాగంగా ప్రతీ మున్సిపాలిటీలో ఎస్టీపీలు నిర్మించాలని నిర్ణయించింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 12 మున్సిపాలిటీలుండగా ఆదిలాబాద్ మున్సిపాలిటీకి ఎస్‌బీఎం–1లోనే రూ.225 కోట్ల నిధులు మంజూరయ్యాయి. వాటి నిర్మాణాలకు స్థలాల గుర్తింపు ప్రక్రియ జరుగుతోంది. మరో 11 మున్సిపాలిటీలకూ నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అత్యధికంగా నిర్మల్ మున్సి పాలిటీకి రూ.18.86 కోట్లు కేటాయించగా, మంచిర్యాలకు రూ.18.22 కోట్లు, మిగతా మున్సిపాలిటీలకు జనాభాకు అనుగుణంగా కేటాయించింది.

ప్రత్యేక పైపులైన్ల ద్వారా..

పట్టణాల్లోని డ్రైనేజీల గుండా వెళ్లే మురుగునీటినంతా ఒక్కచోటకు తీసుకువచ్చేలా ప్రత్యేక పైపులైన్లు ఏర్పాటు చేస్తారు. ప్రభుత్వ డ్రైనేజీలే కాకుండా ఇళ్లు, హోటళ్లు, ధోబీఘాట్‌లలో పోగయ్యే మురుగు నీటినంతా అక్కడికి చేర్చేలా చర్యలు చేపడతారు. ఆయా మున్సిపాలిటీల్లో ఎంపిక చేసిన ప్రదేశాల్లో ఎస్టీపీలు నిర్మిస్తారు. వీటి నిర్వహణ బాధ్యతలు ఎంపిక చేసిన ఏజెన్సీలకే అప్పగిస్తారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల మేరకు హైబ్రిడ్ యాన్యూటి మోడల్‌లో నిర్మాణాలు చేపట్టనున్నారు. మురుగు నీటిని ఎస్టీపీకి సేకరించడం నుంచి శుద్ధి చేసి తిరిగి వదిలే వరకూ నిర్వహణ బాధ్యతలు సంబంధిత ఏజెన్సీ పర్యవేక్షించాల్సి ఉంటుంది. పదేళ్ల వరకు వాటిని నిర్వహించేలా టెండర్ ప్రక్రియలో నిబంధనలు రూపొందించినట్లు తెలుస్తోంది. వీటి నిర్మాణాలకు అవసరమైన స్థలాలను మున్సిపల్ ఇంజినీరింగ్ అధికారులు చేపట్టాల్సి ఉంటుంది. త్వరలోనే వీటి నిర్మాణాలు ప్రారంభమయ్యే అవకాశమున్నట్లు తెలుస్తోంది. నిర్మాణాలు పూర్తయితే త్వరలోనే మురుగునీటి సమస్య తీరడంతో పాటు నీటి వనరులు కలుషితం కాకుండా ఉండే అవకాశముందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

టెండర్ ప్రక్రియ సాగుతోంది

మున్సిపాలిటీల్లో స్వచ్ఛభారత్ మిషన్ 2.0 కింద ఎస్టీపీలు నిర్మించాలని కేంద్రం నిర్ణయించింది. ఈ మేరకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని 11 మున్సిపాలిటీలకు నిధులు విడుదల చేసింది. నిర్మాణాలకు సంబంధించిన టెండర్ ప్రక్రియ రాష్ట్రస్థాయిలోనే జరగనుంది. తొమ్మిది మున్సిపాలిటీలకు కలిపి ఒక యూనిట్‌గా టెండర్లు పిలవనున్నారు. ఈ ప్రక్రియ పూర్తయితే త్వరలోనే పనులు ప్రారంభించే అవకాశముంటుంది. ఇందుకు సంబంధించి ఇంకా మార్గదర్శకాలు అందలేదు.

– గంగాధర్, పబ్లిక్ హెల్త్ ఈఈ, ఆదిలాబాద్ జిల్లా

నూతనోత్సాహంతో పనిచేయాలి



ట్రోఫీతో జీఎం శ్రీనివాస్, అధికారులు

రెబ్బెన: వార్షిక లక్ష్య సాధనకు సింగరేణి ఉద్యోగులంతా నూతనోత్సాహంతో పని చేయాలని జీఎం శ్రీనివాస్ అన్నారు. గోలేటి టౌన్‌షిప్‌లోని జీఎం కార్యాలయంలో గురువారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. బెల్లంపల్లి ఏరియాకు ఈ ఆర్థిక సంవత్సరం నిర్దేశించిన లక్ష్యంలో ఇప్పటివరకు 91 శాతం ఉత్పత్తి సాధించామని తెలిపారు. స్వచ్ఛతలో ఏరియాకు ద్వితీయ బహుమతి రావడం అభినందనీయమని అన్నారు. ఐదుగురు ఉద్యోగులకు పదోన్నతి పత్రాలు అందించారు. ఏఐటీయూసీ నాయకులు బయ్యా మొగిళి, ఎస్‌వోటూజీఎం రాజమల్లు, ప్రాజెక్టు అధికారి నరేందర్, పర్సనల్ మేనేజర్ తిరుపతి, సివిల్ ఎస్ఈ మదీనా బాషా, సీనియర్ పర్సనల్ అధికారి శ్రీనివాస్, ప్రశాంత్ పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

- కలెక్టర్ వెంకటేశ్ దోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

వాంకిడి(ఆసిఫాబాద్): మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. వాంకిడి మండలంలోని బంబార ఆశ్రమ పాఠశాలను గురువారం తనిఖీ చేశారు. వంట గది, పాఠశాల రికార్డులు పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సౌకర్యాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారమే భోజనాలు అందించాలన్నారు. హాస్టల్ పరిసరాలు నిత్యం శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. వార్షిక పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా పదోతరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రియాజ్ అలీ, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

'ఆపరేషన్ స్మైల్' షురూ

- బాలకార్మికుల విముక్తి కోసం రెండు బృందాల ఏర్పాటు
- బాలలను పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు
- నెల రోజుల పాటు కొనసాగనున్న తనిఖీలు



తనిఖీ చేస్తున్న ఆపరేషన్ స్మైల్ బృంద సభ్యులు


పెంచికల్‌పేట్(సిర్పూర్): బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించి బందీలుగా ఉన్న చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఏటా జనవరిలో ఆపరేషన్ స్మైల్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ నెల 1న 11వ విడత కార్యక్రమం ప్రారంభం కాగా, ఈ నెల 31వరకు కొనసాగనుంది. నెల రోజులపాటు ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డివిజన్లలో తనిఖీలు చేపట్టేందుకు రెండు బృందాలను ఏర్పాటు చేశారు. బాలకార్మికుల స్థావరాలుగా నిలిచే పరిశ్రమలు, వ్యాపార సముదాయాలు, గోదాములు, హోటళ్లు, మెకానిక్ షాపులు, ఇటుక బట్టీలు, ఇతర పారిశ్రామిక ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టనున్నారు. గతేడాది నిర్వహించిన ఆపరేషన్ స్మైల్– 10 కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా తనిఖీలు నిర్వహించి 68 మంది చిన్నారులను గుర్తించారు. వీరిలో బాలకార్మికులు 59 మంది ఉండగా.. బాల్య వివాహం చేసుకున్న ముగ్గురు, బడిమానేసిన పిల్లలు ఆరుగురు ఉన్నారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి పిల్లలను అప్పగించారు.

రెండు డివిజన్లు.. రెండు బృందాలు

జిల్లాలో మొత్తం 335 గ్రామ పంచాయితీలు, రెండు మున్సిపాలిటీలు ఉన్నాయి. కలెక్టర్ వెంకటేశ్ దోత్రే నేతృత్వంలో పోలీసు అధికారులు శిశుసంరక్షణ, కార్మిక, బాలల హక్కుల పరిరక్షణ సమితి, విద్యాశాఖ సమన్వయంతో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డివిజన్లలో రెండు బృందాలు ఏర్పాటు చేశారు. కాగజ్‌నగర్ డివిజన్ బృందంలో ఎస్సై రాజయ్య, ఆసిఫాబాద్ డివిజన్ బృందంలో ఎస్సై వెంకటేశ్వర్లుతోపాటు చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి, ఇద్దరు కానిస్టేబుళ్లు, ఒక మహిళా కానిస్టేబుల్, కార్మిక శాఖ నుంచి ఒకరు సభ్యులుగా కొనసాగుతున్నారు. వీరు తప్పిపోయిన పిల్లలు, అనాథలు, వీధిబాలలను గుర్తిస్తారు. అలాగే రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు, హోటళ్లు, దాబాలు, మిల్లులు, ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న బాలలకు ఆశ్రయం కల్పిస్తారు. చిన్నారుల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. అనాథ బాలికలను జిల్లా కేంద్రంలోని వసతి గృహాలకు తరలించి ఉచితంగా విద్య, వైద్యం, భోజన వసతి కల్పిస్తారు.

విజయవంతం చేయాలి

- ఎస్పీ డీవీ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాసరావు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలో చేపట్టిన ఆపరేషన్ స్మైల్ 11వ విడత కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. జనవరి 31 వరకు నిర్వహించే ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం కోసం జిల్లాలో రెండు టీంలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చైల్డ్ ట్రాక్ పోర్టల్, ముఖ కవళికలను గుర్తించే దర్పన్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నట్లు వివరించారు. గతేడాది జూలైలో నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్– 11 ద్వారా పలువురు చిన్నారులను కాపాడామని తెలిపారు. బాలలను పనిలో పెట్టుకున్న యజమానులపై కేసు నమోదు చేయాలని ఆదేశించారు. బాల కార్మికులను గుర్తించి సమాచారం అందించేందుకు చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్లు 1098, 112పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అదనపు ఎస్పీ(అడ్మిన్) ప్రభాకర్‌రావు, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి మహేశ్, డీఎంహెచ్‌వో సీతారాం, డీఈవో యాదయ్య పాల్గొన్నారు.

పకడ్బందీగా తనిఖీలు

రాజ్యాంగం బాలలకు హక్కులు కల్పించింది. వారి హక్కులను కాలరాస్తూ పనిలో పెట్టుకుంటే చట్టప్రకారం కేసులు నమోదు చేస్తాం. బడీడు పిల్లలను తల్లిదండ్రులు పాఠశాలల్లో చేర్పించాలి. రెండు బృందాలతో జిల్లాలో పకడ్బందీగా తనిఖీలు చేపడతాం. దాడుల్లో పట్టుబడితే యజమానులపై కేసు నమోదు చేస్తాం. ఎక్కడైనా బాలకార్మికులను గుర్తిస్తే వెంటనే డయల్ 100 లేదా 1098 టోల్‌ఫ్రీ నంబరుకు సమాచారం అందించాలి.

– బి.మహేశ్, జిల్లా బాలల సంరక్షణ అధికారి

గిరిజన శాఖ ఉద్యోగుల జిల్లా కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

ఆసిఫాబాద్‌అర్బన్: గిరిజన శాఖలో పనిచేస్తున్న నాలుగో తరగతి ఉద్యోగుల జిల్లా కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నారాయణ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పీఎంహెచ్ బాలికల పాఠశాలలో గురువారం రాష్ట్ర అధ్యక్షుడు యాకుబ్, ప్రధాన కార్యదర్శి వాలుసింహ, కోశాధికారి జైతు, ఎన్నికల అధికారి ఏసీఎంవో ఉద్ధవ్ సమక్షంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా రాంచందర్, ఉపాధ్యక్షులుగా కోటయ్య, రవి, ప్రధాన కార్యదర్శిగా పోచం, సహాయ కార్యదర్శులుగా ఓంకార్, కైలాస్, జిల్లా ఆఫీస్ కార్యదర్శులుగా మహేశ్, వసంత్, ప్రచార కార్యదర్శులుగా ఉపేందర్, చిరంజీవి, కోశాధికారిగా చంద్రమోహన్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా రేణుకాబాయి, శంకర్‌ను ఎన్నుకున్నారు. కార్యవర్గ సభ్యులుగా వనిత, సంగీత, శివప్రసాద్, రమేశ్, తెలంగ్‌రావు, చంద్రయ్య, చంద్రకాంత్, బాపు, మౌనిక, రమణ, సీతారాం, వినోద్, వెంకటేశ్, సురేందర్, నాందేవ్, లలిత, రాధాబాయిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని తెలిపారు. నూతన జిల్లా కార్యవర్గం ఐదేళ్లు కొనసాగుతుందని వారు వెల్లడించారు.

క్లుప్తంగా

త్రుటిలో తప్పిన ప్రమాదం



పంచర్ కొట్టును ఢీకొట్టిన కారు

దండేపల్లి(మంచిర్యాల): మండలంలోని ముత్యంపేట పెట్రోల్ బంక్ సమీపంలో గురువారం త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. స్థానికుల కథనం ప్రకారం ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించే క్రమంలో కారు స్వల్పంగా ఆటోకు తగిలింది. దీంతో ఆటో పక్కనున్న చెరువులోకి దూసుకెళ్లి ఒడ్డున ఆగిపోయింది. కారు పక్కనున్న పంచర్ కొట్టును ఢీకొట్టి ఆగిపోయింది. కాగా ప్రమాదంలో ఒకరిద్దరికి స్వల్పగాయాలయ్యాయి.

ఆర్టీసీ బస్సు, బైక్ ఢీ

ముధోల్: ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొన్న ఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం భైంసా డిపోకు చెందిన బస్సు ఎడ్‌బిడ్ గ్రామానికి వెళ్లి వస్తుండగా చించాల వద్దకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న మండలంలోని చించాల గ్రామానికి చెందిన ఆనంద్ బైక్‌ను ఢీకొట్టింది. తీవ్రగాయాలు కావడంతో గమనించిన స్థానికులు 108కు సమాచారం అందించారు. ఈఎంటీ పండరి, పైలట్ నస్రుల్లాఖాన్ ప్రథమ చికిత్స అందించి భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పరారైన ఖైదీ అరెస్టు


ఆదిలాబాద్‌రూరల్: రిమ్స్ ఆస్పత్రి నుంచి మంగళవారం అర్ధరాత్రి పరారైన రిమాండ్ ఖైదీ కొమ్ము ఆకాష్‌ను పట్టుకున్నట్లు మావల ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని సుర్జాపూర్‌కు చెందిన ఖైదీ ఇటీవల రేప్ కేసులో నిందితుడిగా ఉన్నట్లు తెలిపారు. నిర్మల్ జైలులో శిక్ష అనుభవిస్తుండగా అనారోగ్యం బారిన పడడంతో జైలు అధికారులు చికిత్స నిమిత్తం గతనెల 27న జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఎస్కార్ట్ కళ్లు కప్పి ఖైదీ పరార్ కాగా నిర్మల్ జిల్లాలో పట్టుకున్నట్లు వివరించారు.

బైక్ చోరీ కేసులో ఒకరికి ఏడాది జైలు

జన్నారం: బైక్ చోరీ కేసులో ఒకరికి ఏడాది జైలుశిక్ష విధిస్తూ లక్సెట్టిపేట కోర్టు న్యాయమూర్తి మహ్మద్ అసదుల్లా షరీఫ్ గురువారం తీర్పునిచ్చినట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు. 2024 జూలై 30న జన్నారం మండల కేంద్రంలోని ఉడిపి హోటల్ ముందు ఉంచిన కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం చింతకుంట గ్రామంలోని మహమ్మద్‌కు చెందిన పల్సర్ బైక్ అపహరణకు గురైంది. పోలీసుల విచారణలో నిందితులు హైదరాబాద్, నిజామాబాద్, ఆర్మూర్ చుట్టుపక్కల ప్రాంతాల్లో 14 బైక్‌లు దొంగిలించినట్లు తేలడంతో పలువురిని గుర్తించి రిమాండ్ చేశారు. ఇందులో ఏ1 నిందితుడు మూట పెల్లి పవన్‌కు ఏడాది జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

నిర్మల్ పిలుస్తోంది..

జిల్లా లోగో



నిర్మల్ పట్టణం

- చరిత్ర, సంస్కృతి తెలిపేలా ఉత్సవాలు
- ఈ నెల 5, 6, 7 తేదీల్లో సంబురాలు
- జిల్లాలో 'కొత్త'ట్రెండ్.
- ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కలెక్టర్
- పనులు చేస్తున్న వివిధ శాఖలు



నిర్మల్ ఉత్సవాలకు చెందిన కరపత్రం

నిర్మల్: నిర్మల్..అంటే నిన్నమొన్నటిది కాదు. ఈ నేలకు వందలఏళ్ల ఘనమైన చరిత్ర ఉంది. ఇక్కడి గాలిలో ఇప్పటికీ రాంజీసహా వెయ్యిమంది అమరుల ఉచ్వాస, నిశ్వాసలున్నాయి. ఈ మట్టిలో అణువణువునా సమరయోధుల పోరాట పటిమ దాగిఉంది. జీవకళ ఉట్టిపడే కొయ్యబొమ్మ ప్రతిఒక్కరినీ కట్టిపడేస్తుంది. చుట్టుపక్కల జిల్లాల్లో ఎక్కడా లేనంత చారిత్రక, సాంస్కృతిక, రాజకీయ వారసత్వాన్ని నిర్మల్ కలిగిఉంది. ఇప్పటికీ నిమ్మల రాజ్యపు ఆనవాళ్లు మన కళ్లముందు ఠీవీగా కనిపిస్తూనే ఉన్నాయి. ఓరుగల్లు, గోల్కొండకు తీసిపోని విధంగా ఇక్కడ అరుదైన, అద్భుత నిర్మాణాలూ ఉన్నాయి. నిర్మల్‌ను మరోఎత్తుకు తీసుకెళ్లేందుకు కలెక్టర్ అభిలాష అభినవ్ కొత్తఏడాదిలో సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారు. 'నిర్మల్ ఉత్సవాలు' పేరిట ఏటా కార్యక్రమాలు నిర్వహించేలా జిల్లాలో ఓ కొత్తట్రెండ్‌ను ప్రారంభిస్తున్నారు.

వేడుకగా మూడురోజులు..

జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీస్టేడియం కొత్త వేడుకలకు సిద్ధమవుతోంది. ఈ నెల 5, 6, 7తేదీల్లో మూడురోజులపాటు వివిధ కార్యక్రమాల సమాహారంగా 'నిర్మల్ ఉత్సవాలు' కొనసాగనున్నాయి. ఉదయం 11నుంచి రాత్రి 10గంటల వరకు కార్యక్రమాలు ఉండనున్నాయి. ఇందులో సాయంత్రం 5:30 నుంచి 9 గంటల వరకు నేటితరానికి మన చరిత్రను తెలపడం, మనదైన సంస్కృతిని పరిచయం చేయడంతో పాటు, మనవైన ఆహార పదార్థాలనూ ప్రదర్శించనున్నారు. వివిధశాఖలతో పాటు జిల్లా కేంద్రంలోని వాణిజ్య సమూహాల నుంచి ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేయనున్నారు.

నిర్మల్ పేరును నిలిపేలా..

రాష్ట్రంలో ఎక్కడైతే చారిత్రక వారసత్వం ఉందో.. అక్కడ ఎప్పటి నుంచో వివిధ రకాల పేరిట ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. వరంగల్‌లో 'కాకతీయ ఉత్సవాలు', 'ఓరుగల్లు కళావైభవం', 'కాకతీయ సప్తాహం' పేరిట ఉత్సవాలు, నిజామాబాద్‌లో 'ఇందూరు ఉత్సవాలు', కరీంనగర్‌లో శాతవాహన కళోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఇదే క్రమంలో కలెక్టర్ అభిలాష అభినవ్ నిర్మల్‌లోనూ ఉత్సవాలు ఉండాలని 'నిర్మల్ ఉత్సవాల'ను తెరపైకి తెచ్చారు.

స్టాళ్ల కోసం ఆహ్వానం..

ఉత్సవాల్లో వివిధశాఖలతో పాటు ప్రైవేటు వ్యాపారులు, వాణిజ్య సమూహాల నుంచీ స్టాళ్ల ఏర్పాటుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు సంబంధిత అధికారులు వ్యాపార, వాణిజ్యవర్గాలకు సమాచారం అందిస్తున్నారు. స్టాళ్ల ఏర్పాటుపై ఆసక్తిగలవ్యాపారులు డీవైఎస్‌వో శ్రీకాంత్‌రెడ్డిని (9849 9 13071) నంబరులో సంప్రదించాల్సి ఉంటుంది.

ఇప్పటికైనా గుర్తింపు రావాలె..

ఆదిలాబాద్, మంచిర్యాల అంటే తెలుసుకానీ.. నిర్మల్ అంటే ఇప్పటికీ రాష్ట్రంలో చాలామందికి తెలియకపోవడం జిల్లావాసుల దౌర్భాగ్యం. ఇంతటి ఘనమైన చరిత్ర ఉన్న ఈనేల గురించి ఇప్పటికైనా రాష్ట్రవ్యాప్తంగా తెలియజెప్పాల్సిన అవసరం ఉంది. చరిత్రను పాఠాలకు ఎక్కించడంతో పాటు 'నిర్మల్ ఉత్సవాలు' వంటి వేడుకల ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలని జిల్లావాసులు కోరుతున్నారు.



రాంజీగోండ్ స్థూపం

నిర్మల్ కోసం..



నిర్మల్‌కు కలెక్టర్‌గా వచ్చిన తర్వాతే ఇక్కడి చరిత్ర గురించి తెలుసుకున్నా. ఇక్కడి ప్రకృతి, వాతావరణం ఎంతో బాగుంటాయి. ఇలాంటి చారిత్రక వారసత్వం ఉన్న మన జిల్లాలోనూ ఏటా ఉత్సవాలు ఉండాలని 'నిర్మల్ ఉత్సవాలు' ప్రారంభిస్తున్నాం. జిల్లా వాసులంతా విజయవంతం చేయాలని కోరుతున్నాం.

– అభిలాషఅభినవ్, కలెక్టర్

న్యూఇయర్ జల్సా కోసం చోరీ..!



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల



స్వాధీనం చేసుకున్న గుడి గంటలు

- నాగదేవత ఆలయంలో చోరీ కేసు ఛేదించిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ జానకీ షర్మిల

భైంసాటౌన్(ముధోల్): పట్టణ శివారులోని నాగదేవత ఆలయంలో చోరీ కేసు స్థానికంగా కలకలం సృష్టించిన విషయం తెలిసిందే. ఆలయంలో హుండీ, ఆవరణ ధ్వంసం ఘటనపై హిందూ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. దుండగులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేయడంతో పాటు ఒక రోజు భైంసా బంద్ పాటించాయి. దీంతో కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఎస్పీ జానకీ షర్మిల, ఏఎస్పీ అవినాష్ కుమార్ నేతృత్వంలో 48 గంటల్లోనే కేసును ఛేదించారు. గురువారం పట్టణంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఎస్పీ కేసు వివరాలు వెల్లడించారు. మండలంలోని చుచుంద్ గ్రామానికి చెందిన షాని విశాల్, గడపాలే సంగరతన్ నిత్యం మద్యం సేవించేవారు. ఈ క్రమంలో న్యూఇయర్‌ను ఘనంగా చేసుకుందామని నిర్ణయించుకున్నారు. అయితే డబ్బులు లేకపోవడంతో పట్టణ సమీపంలోని నాగదేవత ఆలయంలో చోరీకి పాల్పడ్డారు. మందిర తాళం పగులగొట్టి లోనికి వెళ్లి హుండీలో ఉన్న కానుకలతో పాటు గుడి గంటలను ఎత్తుకెళ్లారు. చోరీకి పాల్పడిన క్రమంలో వారి దుస్తులపై ఆలయంలోని పసుపు, కుంకుమ అంటుకోవడంతో పాటు చోరీ అనంతరం పట్టణంలోకి రాగా ప్రవేశమార్గంలోని సీసీ ఫుటేజీకి చిక్కారు. దీంతో వారిని అనుమానితులుగా గుర్తించిన పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా నేరం చేసినట్లు ఒప్పుకున్నారు. వారి వద్ద నుంచి గుడి గంటలు స్వాధీనం చేసుకుని ఇరువురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. 48 గంటల వ్యవధిలోనే కేసును ఛేదించిన ఏఎస్పీ అవినాష్ కుమార్, పట్టణ సీఐ గోపీనాథ్‌తో పాటు పోలీసు సిబ్బందిని ఆమె అభినందించారు.

కానిస్టేబుళ్లకు ఎస్పీ అభినందన

నిందితుల గుర్తింపులో చురుకుగా వ్యవహరించిన హెడ్ కానిస్టేబుల్ ఆనంద్ జాదవ్, పీసీలు ప్రమోద్ కుమార్, అంబదాస్‌ను ఎస్పీ జానకీ షర్మిల అభినందించి నగదు రివార్డు అందజేశారు. విధి నిర్వహణలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటూ ఆదర్శంగా నిలవాలని సిబ్బందికి సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో క్రీడాకారుల ప్రతిభ



తైక్వాండో పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు



యోగాలో పతకాలు సాధించిన రాహుల్, వైష్ణవి

మంచిర్యాలటౌన్: హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో గురువారం నిర్వహించిన సీఎం కప్ తైక్వాండో రాష్ట్రస్థాయి పోటీల్లో మంచిర్యాల జిల్లాకు చెందిన క్రీడాకారులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు అధ్యక్ష, కార్యదర్శులు జిల్లపల్లి వెంకటస్వామి, బుచ్చి రామారావు, శిక్షకులు మండ శ్రీనివాస్, శ్రావణ్, ప్రసాద్, అరుణ్ తెలిపారు. అండర్ 42 కేజీల విభాగంలో శ్రీహర్షిని బంగారు పతకం, అండర్ 44 కేజీల విభాగంలో పూనం చౌదరి వెండి పతకం, అండర్ 35 కేజీల విభాగంలో క్రిశాన్, అండర్ 48 కేజీల విభాగంలో కార్తీక్, అండర్ 59 కేజీల విభాగంలో మారుతి కాంస్య పతకాలు సాధించారు. హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో జరిగిన సీఎం కప్ యోగా పోటీల్లో రిదామిక్ విభాగంలో జిల్లాకు చెందిన రాహుల్ బంగారు పతకం, వైష్ణవి వెండి పతకం సాధించినట్లు జిల్లా యోగా అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అక్కల తిరుపతి వర్మ, మండ శ్రీనివాస్ తెలిపారు.

ముగిసిన 'దీపస్వరూప్'



రావుడ్ దేవతల ఎదుట దీపారాధన



నైవేద్యం సిద్ధం చేస్తున్న కటోదాలు

కెరమెరి(ఆసిఫాబాద్): ఆదివాసీల ఆరాధ్యదైవం జంగుబాయి పుణ్యక్షేత్రంలో గురువారం దీపోత్సవం(దీపస్వరూప్) నిర్వహించారు. జంగుబాయి వారసులైన వెట్టి, తుంరం, కొడప, రాయిసిడాం, సలాం, మరప, హెర్రకుంరం, మండాడి గోత్రాలకు చెందిన కటోడాలు జంగుబాయి ఆలయానికి చేరుకున్నారు. టోప్లకస్‌లోని జలంతో ఆలయ సన్నిధిలో కొలువుదీరిన దేవతా విగ్రహాలను సంప్రదాయబద్ధంగా శుద్ధి చేశారు. నైవేద్యం తయారుచేసి అక్కడే ఆరగించారు. ఎవరికి వారు డోలు సన్నాయి మేళాలతో వచ్చి ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ఆనవాయితీ. జంగుబాయి, పోచమ్మ, రావుడ్‌తో పాటు మరో ఏడు దేవతా విగ్రహాలను ఆచార వ్యవహారాలతో శుద్ధి చేశారు.

'ఆదాయపు పన్ను మాఫీ చేయాలి'



'పొంగులేటి'కి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికులకు ఆదాయపు పన్ను మాఫీ చేయాలని కోరుతూ సీఐటీయూ నాయకులు గురువారం సీపీఎం మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు సొంత ఇంటి నిర్మాణానికి రెండు గుంటల స్థలం, రూ.20 లక్షల వడ్డీ లేని రుణం ఇవ్వాలని, మారుపేర్లతో పనిచేస్తున్న కార్మికుల పేర్లను క్రమబద్ధీకరించాలని, సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.33 వేల కోట్ల బకాయిలు త్వరగా చెల్లించేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి, ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు, నాయకులు వెంకటస్వామి, రాజేందర్, బాలాజీ, అంబాల శ్రీనివాస్, రాజమౌళి, మంద శ్రీనివాస్, గౌస్, ఈద వెంకటేశ్వర్లు, రాంప్రసాద్ పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల గంజాయి పట్టివేత



ఇచ్చోడ: గంజాయి, నిందితుడితో పోలీసులు



జైనూర్: పట్టుకున్న గంజాయితో పోలీసులు

ఇచ్చోడ: మండలంలోని దూబార్‌పేట్ ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద గురువారం రాత్రి గంజాయి తరలిస్తున్న నిందితుడిని పట్టుకున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు వాహనాలు తనిఖీ చేస్తుండగా సిరికొండ మండలంలోని సోన్‌పెల్లి గ్రామానికి చెందిన మాధవ్ ద్విచక్ర వాహనంపై ఇచ్చోడవైపు వెళ్తూ పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. అతన్ని అదుపులోకి తీసుకుని సంచిని పరిశీలించగా అందులో నాలుగు కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. గంజాయి విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందన్నారు. గంజాయి స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

జైనూర్: మండల కేంద్రంలోని ఓ ఇంట్లో నిల్వ ఉంచిన గంజాయిని గురువారం పట్టుకున్నట్లు ఎస్సై సాగర్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు మండల కేంద్రంలోని ఓ ఇంట్లో తనిఖీలు నిర్వహించగా కిలో 400 గ్రాముల గంజాయిని లభ్యమైనట్లు ఆయన పేర్కొన్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక శిక్షణ

శ్రీరాంపూర్: విద్యార్థుల్లో నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు సీసీసీ సింగరేణి పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు, కంప్యూటర్ సైన్స్ హెచ్‌వోడీ రవీందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థ సీఎండీ ఎన్.బలరాంనాయక్ ఆదేశాల మేరకు ఇన్ఫోసిస్ సంస్థ ద్వారా ఈ శిక్షణ అందిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఉమెన్ ఎంపవర్‌మెంట్‌లో భాగంగా ఇన్ఫోసిస్ 2025 ప్రగతి కోహార్ట్ 4 ప్రోగ్రామ్స్‌లలో విద్యార్థినులకు ఆన్‌లైన్ ద్వారా శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. పోటీ మార్కెట్‌లో ఉద్యోగాలు పొందడానికి అవసరమైన క్లౌడ్ కంప్యూటింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్, డేటా అనలిస్టు వంటి వాటిలో శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు.

ఆర్జీయూకేటీ ఓఎస్డీ బాధ్యతల స్వీకరణ



మురళీదర్శన్

బాసర(ముధోల్): బాసర ఆర్జీయూకేటీ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఓఎస్డీ)గా నియామకమైన ప్రొఫెసర్ మురళీదర్శన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనివర్సిటీ విజన్‌ని సాధించేందుకు అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులతో కలిసి పని చేస్తానని ఆకాంక్షించారు. అధ్యాపకులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

హెడ్‌కానిస్టేబుల్ ఆకస్మిక మృతి



షేక్ అక్తర్ (ఫైల్)

ఆసిఫాబాద్అర్బన్: జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న షేక్ అక్తార్ ఆకస్మికంగా మృతి చెందినట్లు పోలీసు శాఖ గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. షేక్ అక్తర్ డిసెంబర్ 31న ఉదయం 7 గంటలకు విధి నిర్వాహణ నిమిత్తం ఆసిఫాబాద్‌లోని తన ఇంటి నుంచి బయలుదేరే క్రమంలో అకస్మాత్తుగా కిందపడిపోయాడు. ముఖానికి, ఛాతిపైన గాయాలు కావడంతో ముందుగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో అనంతరం రిమ్స్‌కు తరలించారు. మెరుగైన చికిత్సకోసం హైదరాబాద్‌లోని కిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. మృతదేహాన్ని స్వగ్రామమైన ఆదిలాబాద్‌కు తరలించారు. అంత్యక్రియల నిమిత్తం ఎస్పీ ఆదేశాల మేరకు బాధిత కుటుంబానికి పోలీసుశాఖ ఆధ్వర్యంలో రూ.30వేలు అందజేసినట్లు పేర్కొన్నారు.

మెడికోలకు 'వసతి' కష్టాలు



వైద్యకళాశాల ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు

- పాత భవనాల్లో సౌకర్యాల లేమి
- ప్రభుత్వ కళాశాల విద్యార్థులకు తప్పని అవస్థలు
- వసతులు కల్పించాలని కాలేజీ ఎదుట ఆందోళన

ఆసిఫాబాద్‌రూరల్: ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాల్సిన వైద్య విద్యార్థులకు వసతులు లేక నానా తంటాలు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో పూర్తి స్థాయిలో వసతులు కల్పించకుండనే మెడికల్ కళాశాల ప్రారంభించారు. అడ్మిషన్ కూడా కొనసాగి ప్రస్తుతం ద్వితీయ సంవత్సరం తరగతులు కూడా నడుస్తున్నాయి. కానీ కనీస వసతులు కల్పించకపోవడంతో జూడాలు రోడ్డెక్కాల్సిన పరిస్థితి వచ్చింది. గురువారం విద్యార్థులు తరగతులను బహిష్కరించి కళాశాల ఎదుట నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ వెంకటేశ్ దోత్రేకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాలలో తరగతులు బోధించడానికి అవసరమైన ప్రొఫెసర్లు లేకపోవడంతో పాటు భవనం పైపెచ్చులు ఊడిపోతున్నాయని, వర్షం కురిస్తే పైనుంచి నీళ్లు పడుతున్నాయని వివరించారు.

మౌలిక వసతులు కరువు..

మెడికల్ కళాశాలలో 200 మంది విద్యార్థులు ప్రవేశం పొందారు. ప్రస్తుతం ద్వితీయ సంవత్సరం కొనసాగుతోంది. విద్యార్థులకు సరిపడా వసతి గృహాలు లేకపోవడంతో ఐదుచోట్ల ఉంచాల్సిన పరిస్థితి వచ్చింది. పాత కలెక్టరేట్, డీఆర్‌డీవో కార్యాలయం, మార్కెట్ యార్డు కార్యాలయం, జిల్లా ఆసుపత్రి పక్క భవనంతో పాటు, నూతన భవనంలో కొంతమందికి వసతులు కల్పించారు. ఎక్కడ కూడా అవసరమైన మరుగుదొడ్లు, ఇతర సౌకర్యాలు లేకపోవడం, పరిశుభ్రత కానరాక పోవడంతో విద్యార్థులు రోడ్డెక్కారు. వారికి కేవీపీఎస్, డీవైఎఫ్ఐ, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శులు దినకర్, టీకానంద్, తిరుపతి, బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణయ్ మద్దతు తెలిపారు.

ప్రొఫెసర్లను నియమించాలి



ద్వితీయ సంవత్సరానికి వచ్చినప్పటికీ ప్రొఫెసర్లు లేకపోవడంతో తరగతులు లేక నష్టపోతున్నాం. దీంతో రాష్ట్రంలోని ఇతర జిల్లాల విద్యార్థులతో పోటీపడలేని పరిస్థితి ఉంది. సంబంధిత అధికారులు దృష్టిసారించి ప్రొఫెసర్లను నియమించి తరగతులు సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకోవాలి.

– సూర్యప్రకాశ్‌రెడ్డి, ఎంబీబీఎస్ సెకండియర్

వసతిగృహాలు నిర్మించాలి



మౌలిక వసతులు లేకపోవడంతో ఎంబీబీఎస్ చేస్తున్నామన్న ఆలోచన కూడా మాకు కలగడం లేదు. వసతిగృహాలు కూడా పాతబడిన భవనాలు కావడంతో ఉండేందుకు వీలులేకుండా ఉన్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం శాశ్వత ప్రాతిపదికన వసతిగృహాలు ఏర్పాటు చేసి మా కష్టాలు తీర్చాలి.

– పల్లవి, ఎంబీబీఎస్ సెకండియర్

ఆదినారాయణపై దాడి వీడియో వైరల్



ఆదినారాయణపై దాడి చేస్తున్న యువకులు

బెల్లంపల్లి: ఆరిజిన్ డెయిరీ సీఈవో కందిమళ్ల ఆదినారాయణపై దాడి చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. బెల్లంపల్లి బజార్ ఏరియా యూనియన్ బ్యాంకు వీధిలో గత నెల 29న ఆదినారాయణపై దాడి జరగడం, ఆయన ఫిర్యాదు మేరకు మాజీ ఎమ్మెల్యే చిన్నతో సహా ఆరుగురిపై కేసు నమోదు కావడం తెలిసిందే. దాడి ఘటనకు సంబంధించిన వీడియో తాజాగా బయటకు వచ్చింది. సెలూన్‌షాప్ నుంచి ఆదినారాయణను బయటకు తీసుకొచ్చి బట్టలూడదీసి విచక్షణారహితంగా దాడి చేసిన దృశ్యాలు ఉన్నాయి. అతడి స్నేహితుడు నిలువరించే ప్రయత్నాలు చేయగా దుర్భాషలాడారు. రోడ్డు వెంట వెళ్తున్న వ్యక్తులు గుమిగూడి దాడి ఘటనను చూస్తూ ఉండిపోవడం గమనార్హం.